సాక్షి
రంగారెడ్డి
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



అక్రమ నిర్మాణాల కూల్చివేత

జల్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో అధికారులు కూల్చివేయించారు. IIలో▸



ఒకదానికొకటి ఢీకొని..

హైదరాబాద్‌– బీజాపూర్‌ రహదారిపై జరిగిన ప్రమాదంలో నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. IIలో▸



న్యాయం జరిగేలా చూస్తాం

నిజమైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. IIలో▸

న్యూస్‌రీల్‌

ఆల్‌ ఇండియా కిసాన్‌ సభ అవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

తుర్కయంజాల్‌: ఆల్‌ ఇండియా కిసాన్‌ సభ అవిర్భవించి 89 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో పురపాలక సంఘం పరిధి కొహెడలోని సురవరం కాలనీలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కిసాన్‌ సభ పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నారాయణ రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, ఎల్లేష్‌, అనిల్‌, రేఖ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కవిసమ్మేళనానికి ఆహ్వానం



నరేందర్‌రావు



హెర్మాక్‌ ప్రకాష్‌

షాద్‌నగర్‌: తెలుగుభాషకు పట్టాభిషేకం పేరుతో మే 8న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో కవితాగానం చేసేందుకు పట్టణానికి చెందిన యువకవులు నరేందర్‌రావు, హెర్మాక్‌ రవిప్రకాష్‌కు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్‌ శుక్రవారం ఆహ్వానం పంపించారు. తెలుగుభాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ కవిసమ్మేళనంలో కవితా గానం చేసేందుకు ఆహ్వానం అందుకున్న నరేందర్‌రావు, హెర్మాక్‌ రవిప్రకాష్‌ను పట్టణవాసులు పలువురు అభినందిస్తున్నారు.

హనుమాన్‌ శోభాయాత్రను జయప్రదం చేయాలి



శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: హనుమాన్‌ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం బజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో హనుమాన్‌ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ సంస్కృతీ సంప్రదాయలను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలాలు, గ్రామాల్లో జరిగే శోభాయాత్రలో హిందువులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, మాణిక్య రెడ్డి, శర్వలింగం, కుంచం శ్రీనివాస్‌, మహేందర్‌, శ్రీనివాస్‌, అభి, కృష్ణారెడ్డి, శ్రీశైలం, బజరంగ్‌దళ్‌ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ రజతోత్సవానికి రూ.25 లక్షల విరాళం



కేటీఆర్‌కు చెక్కును అందిస్తున్న అవినాష్‌రెడ్డి

షాబాద్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ ఆవిర్భావ సిల్వర్‌ జూబ్లీ వేడుకల సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే సభకు పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్‌రెడ్డి తనవంతు విరాళం అందించారు. ఈ మేరకు శుక్రవారం రూ.25 లక్షల చెక్కును ఆయన పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌కు అందించారు. చెక్కు అందుకున్న కేటీఆర్‌ అవినాష్‌ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌ అడుగుజాడల్లో నడుస్తూ.. కేటీఆర్‌, హరీశ్‌రావు, సబితా రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి మార్గనిర్దేశం మేరకు కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వరి.. కొనేదెప్పుడో మరి!

ప్రారంభమైన పంట కోతలు
- వెంచర్లు, సర్వీసు రోడ్లపై ధాన్యం ఆరబోత
- అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్న వైనం
- నేటికీ తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు
- ఆందోళనలో అన్నదాతలు



మంచాల: కళ్లంలో ఆరబోసిన ధాన్యం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వరి కోతలు మొదలయ్యాయి.. ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభం కాలేదు. మార్కెట్లో అమ్మలేక, ఇంట్లో నిల్వ చేసుకునే సదుపాయం లేక మెజార్టీ రైతులు తమ ధాన్యాన్ని కల్లాలు, సర్వీసు రోడ్లు, సమీపంలోని వెంచర్లలో ఆరబోస్తున్నారు. సాయంత్రం అకస్మాత్తుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలకు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. చేతికి అంది వచ్చిన పంట కళ్లముందే పాడవుతుండటాన్ని చూసి రైతులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. జిల్లా సివిల్‌ సప్లయ్‌ అధికారులు మాత్రం ఇప్పటికీ వరి కోతలు షురూ కాలేదని పేర్కొనడం గమనార్హం. నాలుగు రోజుల తర్వాత కలెక్టరేట్‌లో కొనుగోలు కేంద్రాలపై చర్చించి, ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతుండడం కొసమెరుపు.

నీరుగారుతున్న లక్ష్యం

వర్షాకాలంలో 1,38,187 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. 40 వేలకుపైగా మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన ప్రభుత్వం ఆ మేరకు 1,504 మంది రైతుల నుంచి 7,310 మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. వీటిలో ఐకేపీ కేంద్రాల ద్వారా 462.92 మెట్రిక్‌ టన్నులు, పీఏసీఎస్‌ ద్వారా 4,779.72 మెట్రిక్‌ టన్నులు, డీసీఎంఎస్‌ ద్వారా 2,068.28 మెట్రిక్‌ టన్నులు సేకరించింది. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌ ధర రూ.2,300, గ్రేడ్‌ ఏ రకం ధాన్యానికి రూ.2,320 చొప్పున ప్రకటించింది. సన్నాలకు బోనస్‌గా రూ.500 చెల్లించింది. యాసంగిలో సుమారు 60 వేల ఎకరాల్లో వరిసాగు కాగా, 25 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని సివిల్‌ సప్లయ్‌ అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 36 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 15 వేల మెట్రిక్‌ టన్నుల సన్నాలను సేకరించాలని భావించినప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్క మండల కేంద్రంలోనూ కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. ఇంట్లో నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో మెజార్టీ రైతులు తమ ధాన్యాన్ని సమీపంలోని కల్లాలు, సర్వీసురోడ్లు, వెంచర్లలోని ఖాళీ ప్లాట్లలో ఆరబోస్తున్నారు. పగలంతా ఎండలు భగ్గున మండుతున్నప్పటికీ.. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అకస్మాత్తుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుని, భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. అప్పటికే ఆరుబయట ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసిపోతోంది. చేతికి అందివచ్చిన పంట తీరా వర్షానికి తడిసి పోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

సన్నాలు సేకరించే అవకాశం ఉన్నా..

జిల్లాలో 936 రేషన్‌ షాపుల పరిధిలో 5,71,696 ఆహార భద్రత కార్డులు ఉండగా, 18,71,691 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు సగటున 1,17,54,063 కిలోల బియ్యం అవసరం. ప్రభుత్వం ఏప్రిల్‌ ఒకటి నుంచి ఆహార భద్రతకార్డు లబ్ధిదారులందరికీ సన్న బియ్యం సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఏ జిల్లా అవసరాల మేరకు ఆ జిల్లా రైతుల నుంచే సన్నాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు సివిల్‌ సప్లయ్‌ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికే కోతకు వచ్చిన వరి ధాన్యం దళారులు, ప్రైవేటు మిల్లర్ల చేతుల్లోకి వెళ్లిపోతోంది. మంచాల మండలంలో ఇప్పటికే మెజార్టీ భూముల్లో పంట కోత పూర్తయింది. ఇక్కడ పండిన ధాన్యం దాదాపు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ముందే అప్రమత్తమై.. ఆ మేరకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన జిల్లా అధికారులు ఇప్పటి వరకు అటువైపు దృష్టిసారించకపోవడాన్ని పరిశీలిస్తే.. సన్నాల సేకరణపై చిత్తశుద్ధి అర్థమవుతోంది.

తక్కువ ధరకే అమ్మాల్సి వచ్చింది



నాకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. అర ఎకరం ఎండిపోయింది. రెండు ఎకరాల్లో పంట దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం, ఇంట్లో నిల్వ చేసుకునే సదుపాయం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్మాల్సి వచ్చింది. ప్రభుత్వం ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే నష్టపోవాల్సిన అవసరం ఉండదు.

– సపావత్‌ పాండు, ఎల్లమ్మతండా, మంచాల మండలం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్‌ శాఖ డైరెక్టర్‌ శ్రీదేవి



డీఆర్‌సీ సెంటర్‌ని పరిశీలిస్తున్న మున్సిపల్‌ శాఖ డైరెక్టర్‌ శ్రీదేవి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని తెలంగాణ మున్సిపల్‌ శాఖ డైరెక్టర్‌ శ్రీదేవి అన్నారు. మున్సిపల్‌ శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ ఫల్గుణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆమె మున్సిపల్‌ పరిధిలో పర్యటించారు. మొదటగా మున్సిపల్‌ కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూలు, షాపింగ్‌ కాంప్లెక్స్‌ల్లో వసూలు చేస్తున్న అద్దెలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని డీఆర్‌సీ సెంటర్‌, వివేకానందనగర్‌ కాలనీలోని చిల్డ్రన్స్‌ పార్కుని సందర్శించారు. పట్టణంలో చేయాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి మున్సిపల్‌ కమిషనర్‌ యోగేశ్‌కి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ ప్రత్యేకాధికారి సాయినాథ్‌, శంకర్‌పల్లి మున్సిపాలిటీ మేనేజర్‌ అంజన్‌కుమార్‌, పర్యావరణాధికారి ఆనంద్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌ ధరల పెంపుపై ఫైర్‌



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తదితరులు

షాబాద్‌: కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించి పేద ప్రజలకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. పెంచిన గ్యాస్‌ ధరలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ముంబై–బెంగళూరు లింక్‌ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. జైభీం, జైబాపు, రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ నినదించారు. జ్యోతిరావు పూలే అంబేడ్కర్‌, బాబుజగ్జీవన్‌రామ్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షురాలు పామెన శ్రీజ్యోతి భీంభరత్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సునీతారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌ ధరలను పెంచి మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పెంచిన ధరలను భేషరతుగా తగ్గించాలని డిమాండ్‌ చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని పిలుపునిచ్చారు. సంవత్సరంలో కులగణన చేపట్టిన ఘనత రాష్ట్రంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్‌ అధ్యక్షురాలు అనితారెడ్డి, ఏబ్లాక్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ అశ్విని, పార్టీ మండల అధ్యక్షురాలు స్వరూప, సీనియర్‌ నాయకురాలు సమత, శైలజ, లలిత, అరుణ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లేమూరులో స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రాజుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఫ్యూచర్‌ సిటీ రహదారికి భూములిచ్చేది లేదు

తేల్చి చెప్పిన రైతులు

కందుకూరు: ఫ్యూచర్‌ సిటీ రహదారి నిర్మాణానికి భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. ఫ్యూచర్‌ సిటీలో భాగంగా ఓఆర్‌ఆర్‌ ఎగ్జిట్‌ నంబర్‌ 13 నుంచి కొంగరకలాన్‌, సరస్వతిగూడ, లేమూరు, రాచులూరు, మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆకుతోటపల్లి వరకు నిర్మించ తలపెట్టిన 330 అడుగుల రహదారి నిర్మాణంలో భూమి కోల్పోతున్న లేమూరు రెవెన్యూ రైతులతో శుక్రవారం ఆ గ్రామంలో అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. భూసేకరణాధికారి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రాజు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎకరా, రెండు ఎకరాల భూమి మాత్రమే ఉందని, ఆ భూమిని నమ్ముకునే జీవిస్తున్నామన్నారు. ఇప్పుడు రహదారి కోసం భూమి తీసుకుంటామంటే తాము జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఏం ఇస్తారో తేల్చకుండా రహదారికి తీసుకుంటామని చెప్పడం ఏమిటని నిలదీశారు. ఈ విషయంలో హైకోర్టును సైతం ఆశ్రయించామని, తమ భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. అనంతరం స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయబ్‌ తహసీల్దార్లు తారకేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌, ఆర్‌ఐ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. వేంకటేశ్వరుడి కల్యాణం



భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

మొయినాబాద్‌: పచ్చని తోరణాలు.. పూల పందిరి.. మంగళవాయిద్యాలు.. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కలియుగదైవం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ప్రారంభమైన వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణం అర్ధరాత్రి 2 గంటల వరకు కనుల పండువగా సాగింది. ముందుగా స్వామి వారిని ఊరేగింపుగా తీసుకెళ్లి దేవాలయం సమీపంలోని మండపంలో వేంచేయించారు. అనంతరం అమ్మవార్లను ఊరేగింపుగా స్వామివారి చెంతకు తీసుకెళ్లి ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి, అమ్మవార్ల తరఫువారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆలయ అర్చకులు నృత్యాలు చేస్తూ ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని రక్తికట్టించారు. అనంతరం స్వామివారు, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ గర్భగుడి వెనకభాగంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో ఆసీనులను చేశారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ముందుగా విశ్వక్సేనుని ఆరాధించి శుద్ధివచనం, పుణ్యాహవచనాలు చేపట్టారు. భారతీయ సంప్రదాయంలో కల్యాణం, తాళిబొట్టు, పెళ్లి పందిరికి ఉన్న విశిష్టతలను అర్చకులు భక్తులకు వివరిస్తూ వైకుంఠవాసుని కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. కల్యాణ మహోత్సవం సుమారు 3 గంటలపాటు నేతపర్వంగా సాగింది. ఈ మహోత్సవంలో ఆలయ మేనేజింగ్‌ కమిటీ కన్వీనర్‌ గోపాలకృష్ణ స్వామి, అర్చకులు రంగరాజన్‌, తిరుమల కిరణాచారి, పరవాస్తు రామాచారి, నరసింహన్‌, కన్నయ్య, కిట్టు, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి వాహనసేవలు

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని, అమ్మవార్లను జగవాహనంపై చిలుకూరు గ్రామంలో ఊరేగించారు.

ముందు పరిహారం తేల్చండి

- ఆ తర్వాతే సేకరణకు రండి
- ఈ భూములను నమ్ముకునే బతుకుతున్నాం
- ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ఇవ్వాల్సిందే..
- తేల్చి చెప్పిన శివన్నగూడ రిజర్వాయర్‌ భూ బాధిత రైతులు
- భూసేకరణ సమావేశం బహిష్కరణ



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

మంచాల: నష్టపరిహారం విషయంలో స్పష్టత లేకుండా భూసేకరణ చేస్తే సహించేది లేదని శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోయపల్లి రెవెన్యూ పరిధిలోని శ్రీమంత్‌గూడలో శుక్రవారం తహసీల్దార్‌ ఎంపీ ప్రసాద్‌ ఆధ్వర్యంలో భూసేకరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీమంత్‌గూడలో 40 నుంచి 66 సర్వే నంబర్లలో 267 మంది రైతులకు సంబంధించి 148.31 ఎకరాలు సేకరించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. తమ భూములు తీసుకొని నష్టపరిహారం ఎంత ఇస్తారని రైతులు నిలదీశారు. ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ప్రకటించాలని, ఎకరాకు రూ.40 లక్షల పరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు. కొంత భూమి తీసుకొని మిగతాది తీసుకోమని చెప్పడం సరైంది కాదన్నారు. సగం భూమి రిజర్వాయర్‌లో పోతే మిగతా సగం రైతులు దున్నుకోలేరని, ఉపయోగం లేకుండా పోతుందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధానాల ప్రకారం నిర్ణయించిన ధర కంటే మూడింతల చొప్పున ఎకరాకు రూ.23 లక్షలు చెల్లించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. తమ తాతల కాలం నుంచి రెక్కలు ముక్కలు చేసుకొని సాగు చేసిన భూములను తక్కువ ధరకు ఇవ్వబోమని రైతులు తేల్చిచెప్పారు. లక్షల రూపాయలు వెచ్చించి భూములను చదును చేసి, బోర్లు వేసి పొలాలుగా మార్చుకున్నామని తెలిపారు. ఉన్న పలంగా ఇచ్చినకాడికి పరిహారం తీసుకొని వదిలి వెళ్లిపోవాలని చెప్పడం సరైంది కాదని చెప్పి సభను బహిష్కరించారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌ డీఈ సురేందర్‌రెడ్డి, ఈఈ రాములు, ఏడబ్ల్యూఈ అండాలు, ఆర్‌ఐలు రమేష్‌, శ్రీనివాస్‌, వీఆర్‌ఓలు మెరిగె నాగరాజు, శ్రీనివాస్‌, ఫీల్డ్‌ ఆఫీసర్‌ యాట భాస్కర్‌, పంచాయతీ కార్యదర్శి హరీష్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.40 లక్షలు ఇవ్వాలి



మాకు 58, 59 ,60 సర్వే నంబర్లలో భూమి ఉంది. శివన్నగూడ రిజర్వాయర్‌లో రెండున్నర ఎకరాలు పోతుంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో బయట అర ఎకరా కూడా రాదు. ఎకరాకు రూ.40 లక్షలు ఇవ్వాలి.

– కొంపల్లి యాదగిరి, రైతు, కుదాభక్షపల్లి

జీవితాలు ఆగం చేయొద్దు



నాకు సర్వే నంబర్‌ 42లో నాలుగు ఎకరాలు ఉంది. ఈ భూములనే నమ్ముకొని జీవిస్తున్నాం. వ్యవసాయం తప్ప ఏ ఆధారం లేదు. జీవితాలను ఆగం చేయొద్దు. మా జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని పరిహారం అందించాలి.

– రామావత్‌ శ్రీను, రైతు, ఎల్లపల్లి తండా

బడుగుబలహీన వర్గాల దిక్సూచి పూలే



కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: బడుగుబలహీన వర్గాలకు దిక్సూచి మహాత్మా జ్యోతిబా పూలే అని, నేటి తరానికి ఆయన స్ఫూర్తి దాయకమని అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌ మాట్లాడుతూ.. బహుజన తత్వవేత్త, సామాజిక దార్శనికుడు మహాత్మాజ్యోతిబా పూలే అని కొనియాడారు. వర్ణ వివక్షను రూపుమాపడం, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైందని గుర్తు చేశారు. కుల, లింగ వివక్షకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయని ఆలోచించారన్నారు. అనంతరం వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి బి.రమేష్‌ గీసిన మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటాన్ని అదనపు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, బీసీ సంక్షేమ అధికారి కేశురాం, పీడీ మెప్మా మల్లీశ్వరి, సివిల్‌ సప్లయ్‌ అధికారి శ్రీనివాస్‌, ఈడీ ఎస్సీ కార్పొరేషన్‌ పద్మావతి, డీపీఆర్‌ఓ వెంకటేశం, వడ్డెర సంఘం ప్రతినిధి బోసు రవి, బీసీఫ్రంట్‌ చైర్మన్‌ మల్లేష్‌, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీతో ప్రహరీ కూల్చివేత

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై 'సాక్షి'లో ఈ నెల 11న 'శిఖం భూమిలో నిర్మాణాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి బాలాపూర్ మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ ఇందిరా దేవి, ఆర్‌ఐ జమీల్‌తో కలిసి పోలీస్ బందోబస్తు నడుమ సర్వే నంబర్ 69లో 1000 గజాల విస్తీర్ణంలో వెలిసిన భారీ ప్రహరీని జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దీంతో పాటు కుర్మల్‌గూడలోని సర్వే నంబర్ 80లో అక్రమంగా నిర్మించిన ఓ ప్రహరీ, సాగుకు మాత్రమే వినియోగించాల్సిన భూమిలో వెలసిన కట్టడాలను కూల్చివేశామని పేర్కొన్నారు. భూములు కబ్జాకు గురైతే.. పౌరులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

వ్యక్తిత్వ వికాసానికి చదువు దోహదపడాలి


విద్యార్థులతో బోధమయానందస్వామి

ఇబ్రహీంపట్నం: రామకృష్ణ మఠం ప్రతినిధి శ్రీబోధమయానందస్వామి శుక్రవారం పెద్ద అంబర్‌పేట్‌లోని క్యాండర్ షైన్ స్కూల్ విద్యార్థులతో గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే విద్య పుస్తకాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా ఉండాలని సూచించారు. ధర్మం, శాంతి, సేవాభావం అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లారెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల గుర్తింపునకు కృషి

లక్డీకాపూల్: నగరంలోని వీధి వ్యాపారులకు చట్టపరమైన గుర్తింపునకు కృషి చేయనున్నట్టు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. వారి హక్కులు, వృత్తి స్వాతంత్ర్యం, జీవనోపాధి భద్రతతో పాటుగా వాణిజ్య నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. శనివారం మేయర్ జాతీయ హాకర్స్ ఫెడరేషన్ (ఎన్‌హెచ్‌ఎఫ్) ప్రతినిధులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వీధి వ్యాపారులతో సంబంధిత అనేక ముఖ్య అంశాలపై లోతుగా చర్చించారు. ప్రత్యేకంగా ఈ సమావేశానికి ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌హెచ్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి శక్తిమాన్ ఘోష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలలో 1,500కిపైగా అనుబంధ సంఘాలు, 20 లక్షలమందికి పైగా వీధి వ్యాపారాలను చేసుకుంటున్నట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. ఈ మేరకు మేయర్ వీధి వ్యాపారుల సంక్షేమం కోసం అధికారులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. వీధి వ్యాపారులు కూడా నగర అభివృద్ధిలో భాగస్వాములే కాబట్టి, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు సమాధానాలు కనుగొనే దిశగా నడవాల్సిన అవసరం ఉందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 142 వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 55 సంవత్సరాల ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో కారుతో ఢీ

- బైక్‌పై వెళ్తున్న యువతి మృతి, యువకుడికి తీవ్ర గాయాలు
- అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో ఘటన
- కారుతో పరారవుతుండగా నిందితుడిని పట్టుకున్న పోలీసులు


ప్రమాదానికి కారణమైన కారు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్

ఇబ్రహీంపట్నం: అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ యువతి అక్కడికక్కడే మృతిచెందగా.. యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారుతో పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా నారాయణపూర్ మండలం చిల్లాపూర్ గ్రామానికి చెందిన కొప్పు శంకరయ్య కూతురు స్పందన (19) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ సంస్కృతి ఇంజనీరింగ్ కాలేజీలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. సైదాబాద్ సింగరేణికాలనీలో నివాసముండే తన స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి గురువారం సాయంత్రం బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ సమీపంలో ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఘట్‌కేసర్ వైపునకు వెళ్తున్నారు. ఈ సమయంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ గాల్లో ఎగిరి కారు అద్దంపై పడ్డారు. కారు అదే స్పీడ్‌లో వెళ్లడంతో కింద పడిపోయారు. స్పందన అక్కడికక్కడే మృతిచెందగా, సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సాయికుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. స్పందన మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో అదుపులోకి..

ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన స్కోడా కారుతో సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తుండగా కారు అద్దాలు పగిలి ఉండడం, డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా యాక్సిడెంట్ చేసినట్లు అంగీకరించడంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి ప్రాంతానికి చెందిన ప్రదీప్ అనే వ్యాపారవేత్తగా గుర్తించారు. ప్రస్తుతం అతను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల అదుపులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతుల మధ్య తగాదా

భర్త అదృశ్యం


రవి (ఫైల్)

శంకర్‌పల్లి: దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా మనస్తాపానికి గురైన భర్త అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. కొండకల్ తండాకు చెందిన పి.రవి(33), తేజశ్రీ దంపతుల మధ్య ఆర్థిక అంశాల్లో తరచూ గొడవపడుతున్నారు. ఈ క్రమంలో 7న మరోమారు గొడవ పడడంతో రవి.. ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆయన సోదరుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల పక్షాన అలుపెరగని పోరాటం

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- తుక్కుగూడలో సంఘం జిల్లా కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్ని టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. తుక్కుగూడలో శక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం 2006లో టీడబ్ల్యూజేఎఫ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి ఈరోజు వరకు జర్నలిస్టుల పక్షాన అలుపెరగకుండా పోరాడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని జర్నలిస్టు సంఘాలు ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి వత్తాసు పలికి, స్వార్థ రాజకీయాల కోసం సంఘాలను వాడుకుంటున్నాయని ఆరోపించారు. ప్రైవేటు విద్యారంగంలో జర్నలిస్టుల పిల్లలుకు ఫీజులో 50 శాతం రాయితీ అందించాలని, వైద్యంలో రాయితీ ఇవ్వాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా సంఘంలో చేరిన వారికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర నాయకులు జగదీశ్, రాజశేఖర్, ఆనందం దేవేందర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సత్యానారాయణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక


బహుమతులతో అరుణ్‌తేజ్

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లికి చెందిన కర్నేకోట అరుణ్‌తేజ్ ఆంధ్రప్రదేశ్ తరపున అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. నేపాల్‌లో మే 26 నుంచి 31 వరకు జరిగే అంతర్జాతీయ స్థాయి ఇండో నేపాల్ క్రికెట్ పోటీల్లో అండర్- 19 విభాగంలో ఇండియా తరపున ఆల్‌రౌండర్‌గా ఎంపికయ్యాడు. అరుణ్‌తేజ్ ప్రస్తుతం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తెలంగాణ నుంచి అండర్ -12, అండర్-14 క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాడు. అనంతరం ఇక్కడి నుంచి ఆడేందుకు అవకాశాలు రాకపోవడంతో నాలుగేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు మారాడు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఒంగోలులో శిక్షణ తీసుకున్నాడు. తాజాగా ఇండియా టీం తరపున ఆల్‌రౌండర్‌గా అండర్ -19 విభాగంలో ఎంపికయ్యాడు. మన్సూరాబాద్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున శిక్షణ పొందుతున్నాడు.

మాల్‌లో ఎంఓఆర్‌డీ బృందం పర్యటన


మాల్ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంఓఆర్‌డీ బృందం

యాచారం: మండల పరిధిలోని మాల్ గ్రామంలో శుక్రవారం ఎంఓఆర్‌డీ (మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) బృందం పర్యటించింది. ఉన్నతాధికారులు పంకజ్, చంద్రానిషా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరవుతున్న నిధుల ఖర్చు, చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రజలకు ఏ విధమైన మేలు జరుగుతోంది, నిధులు దుర్వినియోగం అవుతున్నాయా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలతతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నుల వసూళ్లు, తాగునీటి సమస్య, ఈజీఎస్ పనులపై ఆరా తీశారు.

గిరిజన రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి


గిరిజన రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి శుక్రవారం నక్కర్తమేడిపల్లి రెవెన్యూ పరిధిలో పర్యటించారు. ఏళ్లుగా కబ్జాలో ఉన్న పల్లెచెల్కతండా గిరిజనులకు ఆ భూములపై పరిహారం అందకపోవడంతో గురువారం సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకోవడం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్డీఓ అనంత్‌రెడ్డి తహసీల్దార్ అయ్యప్పతో కలిసి సర్వేనంబర్ 184లో పర్యటించారు. ఎన్నేళ్లుగా కబ్జాలో ఉంటున్నారు, గతంలో పరిహారం ఎందుకు రాలేదు, దరఖాస్తు చేసుకోలేదా.. అధికారులు రాలేదా అని ఆరా తీశారు. కబ్జాలో నిజంగా ఎంతమంది రైతులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, టీజీఐఐసీ అధికారులతో మాట్లాడి కబ్జాలో నిజమైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తాడిపర్తిలో పనులను అడ్డుకున్న రైతులు

తాడిపర్తిలో శుక్రవారం ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ పనులను ఆ గ్రామ రైతులు అడ్డుకున్నారు. 104 సర్వే నంబర్‌లో కబ్జాలో ఉన్న రైతులకు పరిహారం అందజేసే వరకు ఆందోళన నిర్వహిస్తామని.. సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సముదాయించారు. విషయాన్ని ఆర్డీఓ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బుధవారం వచ్చి వివరాలు తెలుసుకుంటానని చెప్పడంతో రైతులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఒకదానికొకటి ఢీకొని..

వరుసగా నాలుగు వాహనాలు ధ్వంసం


ప్రమాదంలో దెబ్బతిన్న ఓ కారు

చేవెళ్ల: హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై వాహనాల రద్దీ కారణంగా ముందు వెళ్తున్న వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆలూరు బస్‌స్టేజీ సమీపంలో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ఓ ఆటో ఆగి ఉంది. దాని వెనుకే మరో ఆటో వెళ్లి ఆగుతుండగానే గమనించకుండా వెనకాలే వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు ఆగి ఉన్నమరో ఆటోను ఢీకొట్టింది. కారు వెనకాలే వచ్చిన మరో కారు ముందున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ఆటోలు, రెండు కార్లు ధ్వంసమయ్యాయి. వాహన యజమానులు వాగ్వాదానికి దిగడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ పోలీసులు వచ్చి వారిని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించి పంపించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

రాచకొండ సీపీ సుధీర్ బాబు


నాగారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

కీసర: నేర నియంత్రణతో పాటు నేరస్తులకు శిక్ష పడేలా చేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. కమిషనరేట్‌లోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన 1460 సీసీ కెమెరాలను నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్‌లో ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మల్కాజిగిరి జోన్ పరిధిలో మొత్తం 1460 కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇందులో 410 కెమెరాలను 17 కాలనీల్లో, ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద ఏర్పాటు చేశామన్నారు. వీటి కోసం రూ.1.19 కోట్లు ఖర్చు చేశామని, రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా సంబంధిత కాంట్రాక్టర్‌దేనని చెప్పారు. మిగిలిన 1050 కెమెరాలను 212 దేవాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు 5260 కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, 93,061 నేను సైతం కెమెరాలు కలిసి మొత్తం 98,321 కెమెరాలను జియో ట్యాగింగ్ చేశామన్నారు. వీటన్నిటినీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక బృందం నిరంతరం పరిశీలిస్తుందన్నారు. భద్రత, సురక్షితమే ధ్యేయంగా నిఘా నేత్రాలను ఆవిష్కరిస్తున్నామన్నారు. కోర్టులకు సాక్ష్యాధారాలను సమర్పించవలసి వచ్చినప్పుడు కెమెరాలు కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పోలీస్ కమిషనరేట్‌గా మల్కాజిగిరి రాచకొండ కమిషనరేట్ ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ పద్మజ, అదనపు డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, కుషాయిగూడ ఏసీపీ మహేష్ గౌడ్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు

ఇబ్రహీంపట్నం: క్రమశిక్షణతో వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలక్రిష్టారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని సైంట్ విద్యాసంస్థల 24వ వార్షికోత్సవానికి శుక్రవారం సాయంత్రం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని.. వీటిని అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతూ పట్టుబడిన బీటెక్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: గంజాయి తాగుతున్న ఐదుగురు బీటెక్ విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఇబ్రహీంపట్నంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గురునానక్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు స్థానిక చైతన్యనగర్‌లో నివాసముంటున్నారు. వీరు ఓ ఇంట్లో గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 290 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన వ్యక్తితో పాటు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రి ఉద్యోగి ఆత్మహత్య

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రి ఉద్యోగి ఒకరు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. యాజమాన్యం సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం బెంగాల్‌కు చెందిన మెహరాజ్ ఆలమ్ (24) ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రిలో గత నాలుగేళ్లుగా నర్సింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలలుగా వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురైన మెహరాజ్ ఆలం శుక్రవారం అధిక మొత్తంలో మత్తు ఇంజెక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీన్ని తోటి సిబ్బంది గమనించి వెంటనే చికిత్స అందించేందుకు ప్రయత్నించినా పరిస్థితి విషమించి..మెహరాజ్ అక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడినట్లు సన్నిహితులు పేర్కొంటున్నారు. కాగా ఈ విషయన్ని వెలుగులోకి రాకుండా ఆసుపత్రి యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. తీరా బయటకు పొక్కడంతో పోలీసులు మెహరాజ్ రూంలో ఉంటున్న వ్యక్తి నుంచి ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఎల్‌జీ యాజమాన్యం ప్రతి నెలా కార్మికులు, కిందిస్థాయి ఉద్యోగులకు, డాక్టర్లకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల సుమారు 100 మంది కార్మికులు ఈ విషయంపై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం వచ్చారు. అనంతరం కార్మిక శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి రియల్టీ

IV

శనివారం
12-04-2025

ఇల్లు ఆఫీసు షాపింగ్

- మెట్రో నగరాల్లో మిశ్రమ వినియోగ భవనాలు
- ఆయా నిర్మాణాల్లో రిటైల్ స్పేస్‌కు డిమాండ్
- 2025 క్యూ1లో దేశంలో 24 లక్షల చ.అ. లావాదేవీలు
- అత్యధికంగా హైదరాబాద్‌లోనే 34 శాతం లీజులు
- గ్రేటర్‌లో 8 లక్షల చ.అ. రిటైల్ స్థల లావాదేవీలు
- మన తర్వాతే ముంబై, ఎన్‌సీఆర్ నగరాలు
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అధ్యయనం వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో నగరాలలో సంప్రదాయ షాపింగ్ మాల్స్‌కు కాలం చెల్లింది. ఇల్లు, ఆఫీసు, మాల్ అన్నీ ఒకే చోట ఉండే మిశ్రమ వినియోగ భవనాలు ఊపందుకుంటున్నాయి. నగరవాసులు నివాసం ఉండే చోటుకు సమీపంలోనే కార్యాలయం, వారాంతాల్లో కుటుంబంతో కలిసి ఆనందంగా గడిపేందుకు షాపింగ్ మాల్ కూడా దగ్గర్లోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లు, ఆఫీసు స్పేస్‌తో పాటు రిటైల్ స్పేస్ అందుబాటులో ఉండే మిశ్రమ భవనాలకు డిమాండ్ పెరిగింది.

❖ ఈ ఏడాది జనవరి–మార్చి (క్యూ1)లో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 24 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లావాదేవీలు జరిగాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అధ్యయనం వెల్లడించింది. ఏడాది కాలంలో 55 శాతం వృద్ధి రేటు నమోదైంది. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో మాల్స్, రిటైల్ సరఫరా పెరగడమే లావాదేవీల వృద్ధికి ప్రధాన కారణం. ఈ ఏడాది వచ్చే మూడు త్రైమాసికాల్లో కొత్తగా 70 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తుందని అంచనా వేసింది.

అత్యధికంగా గ్రేటర్‌లోనే..

గృహాలు, కార్యాలయాల విభాగంలోనే కాదు రిటైల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ దూసుకెళుతోంది. 2025 క్యూ1లో జరిగిన లావాదేవీల్లో అత్యధికంగా 34 శాతం వాటా మన గ్రేటర్‌దే. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో నగరంలో 8 లక్షల రిటైల్ స్థల లావాదేవీలు జరిగాయి. ఏడాది కాలంతో పోలిస్తే ఇది 106 శాతం ఎక్కువ. హైదరాబాద్ తర్వాత అత్యధికం రిటైల్ స్పేస్ లావాదేవీలు ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాల్లో జరిగాయి. 2025 క్యూ1లో దేశంలో జరిగిన మొత్తం రిటైల్ స్థల లీజుల్లో ముంబై 24 శాతం, ఢిల్లీ–ఎన్‌సీఆర్ 17 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. ఆర్థిక రాజధాని(ముంబై)లో 5.8 లక్షల చ.అ., దేశ రాజధానిలో 4.1 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి.

హైస్ట్రీట్‌కు డిమాండ్

గ్రేటర్‌లో హైస్ట్రీట్ ప్రాంతాల్లోని రిటైల్ స్పేస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. నగరంలో జరిగిన లీజు లావాదేవీల్లో హైస్ట్రీట్ వాటా 90 శాతంగా ఉంది. కొత్తపేట, నల్లగండ్ల, కొంపల్లి వంటి ప్రాంతాల్లో అత్యధిక లావాదేవీలు జరిగాయి. ఒక్క జూబ్లీహిల్స్‌లోనే ఏకంగా 24 శాతం లావాదేవీల వాటా కలిగి ఉంది. జూబ్లీహిల్స్‌లో రిటైల్ స్పేస్ అద్దెలు ఏటా 13.6 శాతం పెరుగుతున్నాయి. షాపింగ్ మాల్స్‌లో మాత్రం అద్దెలు స్థిరంగా ఉన్నాయి. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, టోలిచౌకీ ప్రాంతాలలో కొత్త ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణలతో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయి. సూక్ష్మ మార్కెట్లతో కనెక్టివిటీ పెరగడంతో ఆయా ప్రాంతాలలో రిటైల్ స్టోర్లు, స్థలాలకు ఆదరణ పెరిగింది.

దేశీయ బ్రాండ్లదే హవా..

ఫ్యాషన్, వెల్‌నెస్, ఫుడ్ అండ్ బేవరేజెస్ విభాగాలు ఎక్కువగా రిటైల్ స్పేస్‌ను లీజుకు తీసుకుంటున్నాయి. లీజు లావాదేవీల్లో దేశీయ బ్రాండ్ల వాటా ఏకంగా 98 శాతంగా ఉంది. ఫ్యాషన్ విభాగం 27 శాతం, వెల్‌నెస్ 19 శాతం, ఫుడ్ అండ్ బేవరేజెస్ 16 శాతం లీజు వాటాలను కలిగి ఉన్నాయి.



ఐఓటీ గృహాలు!

డిజిటల్ తాళాలు, స్మార్ట్ కెమెరాలు, వీడియో డోర్ బెల్స్

నగరంలో పెరుగుతున్న ఐఓటీ ఆధారిత పరికరాల వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: కరోనా తర్వాత ఇంటి స్వరూపం మారిపోయింది. ఇంటిలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారిత భద్రతా ఉపకరణాల వినియోగం పెరిగింది. రియల్ టైమ్‌లో ట్రాక్ చేసే స్మార్ట్ కెమెరాలు, డిజిటల్ లాక్స్, స్మార్ట్ వీడియో డోర్ బెల్స్, లైట్లు, కర్టెన్లు ప్రతిదీ స్మార్ట్‌గా మారిపోయాయి. వేలిముద్ర, ఐరిష్ చూపిస్తే చాలు ఆటోమెటిక్‌గా ఇంటి తలుపులు తెరుచుకుంటాయి. ఇంట్లో మనం లేకపోయినా ఎవరైనా అతిథులొస్తే ఫోన్‌లో నుంచే గుమ్మం తెరిచి స్వాగతం పలకొచ్చు. గదిలోకి రాగానే లైట్లు వాటంతటవే ఆన్, ఆఫ్ అవుతుండటం వంటి ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

- చాలా మంది బిల్డర్లు ఇంటి నిర్మాణ సమయంలోనే ఈ స్మార్ట్ ఉపకరణాలను జోడిస్తున్నారు. కోకాపేట, మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లోని హైఎండ్ ప్రాజెక్ట్‌లలో ఈ తరహా ఐఓటీ ఉపకరణాల ప్రాజెక్ట్‌లు ఎక్కువగా నిర్మాణంలో ఉన్నాయి. వృద్ధులు, చిన్న పిల్లలు ఉండే వారు వ్యక్తిగత గృహాలలో సైతం వీటిని ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరిగా మారింది.



సొంతింటికే.. 25% సంపాదన!

సాక్షి, సిటీబ్యూరో: మన దేశంలో అత్యంత ధనవంతులు తమ సంపదలో 22–25 శాతం మొత్తాన్ని తాము ఉండాలనుకుంటున్న ఇంటి కొనుగోలుకే వెచ్చిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా సర్వే వెల్లడించింది. రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం కలిగిన 18–35 ఏళ్ల వయస్సు గల వారిలో 89 శాతం మంది సంపన్న భారతీయులు తమ ప్రాపర్టీని అద్దెకు ఇవ్వడంకంటే అందులో తాము ఉండటానికే మొగ్గు చూపిస్తున్నారు. కోటి డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు కలిగిన భారతీయ అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు తమ సంపదలో 22–25 శాతాన్ని తాము నివసించాలనుకునే ప్రధాన ఇంటికి కేటాయిస్తున్నారని, వారి హోల్డింగ్స్‌లో 80–90 శాతం దేశంలోనే కేంద్రీకృతమై ఉన్నాయని నివేదిక వెల్లడించింది.

- దేశంలో అధిక నికర విలువ కలిగిన వ్యక్తుల సంఖ్య 2024లో 6 శాతం మేర పెరిగి 80,686 నుంచి 85,698కు చేరుకుందని, బిలియనీర్ల సంఖ్య 191కు పెరిగిందని వెల్త్ రిపోర్ట్ వెల్లడించింది. 2028 నాటికి వారి సంఖ్య 93,753కు పెరుగుతుందని అంచనా. హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) పెట్టుబడుల్లో ఎక్కువ భాగం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నైలకే వస్తున్నాయి. విదేశీ పెట్టుబడుల విషయానికొస్తే.. ఎక్కువ మంది హెచ్‌ఎన్‌ఐలు యూఏఈ, యూకే వంటి దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని నైట్‌ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 47 శాతం మంది లగ్జరీ కార్లలో పెట్టుబడులకు, 28 శాతం మంది హైఎండ్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.



రూ.50 కోట్ల ఇల్లయినా.. తగ్గేదేలే!



ఇంటి బడ్జెట్ అంటే లెక్కేలేదు. ఒకటి, రెండు కాదు ఏకంగా రూ.50 కోట్లయినా సునాయాసంగా ఖర్చు చేసేస్తున్నారు. గతంలో ఇల్లు కొనాలంటే బడ్జెట్‌ను ప్రధానంగా పరిగణలోకి తీసుకునేవారు. కానీ, ఇప్పుడు ఎంత ఖరీదైన ఇళ్లయితే అంత గొప్ప. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగానే డెవలపర్లు కూడా ప్రీమియం, అల్ట్రా లగ్జరీ గృహాలను నిర్మిస్తున్నారు. ఏటేటా అందుబాటు గృహాల విక్రయాలు తగ్గుతూ.. అల్ట్రా లగ్జరీ ఇళ్ల అమ్మకాలు పెరుగుతుండటమే ఇందుకు ఉదాహరణ.

– సాక్షి, సిటీబ్యూరో



ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో గణనీయమైన వృద్ధి



- ఏడాదిలో 483 శాతం వృద్ధి రేటు నమోదు
- హైదరాబాద్‌లో 9,459 గృహాల అమ్మకాలు
- నగరంలో 10,661 యూనిట్లు లాంచింగ్
- 40 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా–2025 క్యూ1 అధ్యయనం

ఏటేటా రూ.50 లక్షలలోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాల విక్రయాలు తగ్గుతున్నాయి. వీటి స్థానంలో రూ.50 కోట్ల కంటే ఎక్కువ ధర ఉండే అల్ట్రా లగ్జరీ యూనిట్ల అమ్మకాలు శరవేగంగా పెరుగుతున్నాయి. 2025 జనవరి–మార్చి(క్యూ1)లో అమ్ముడైన ఇళ్లలో అందుబాటు గృహాలు 21,010గా ఉన్నాయి కానీ, గతేడాది క్యూ1తో పోలిస్తే ఈ విభాగంలో సేల్స్ 9 శాతం మేర తగ్గాయి. అదే 2025 క్యూ1లో 169 అల్ట్రా లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోగా.. గతేడాది క్యూ1తో పోలిస్తే ఏకంగా 483 శాతం వృద్ధి నమోదైంది. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉండే ఇళ్లు 26,832 సేల్ కాగా.. 2024 తొలి త్రైమాసికంతో పోలిస్తే 6 శాతం తక్కువ. ఇక,



రూ.కోటి నుంచి రూ.2 కోట్ల ధర ఉండే యూనిట్లు 2 శాతం వృద్ధి రేటుతో 22,230 అమ్ముడుపోయాయి. రూ.2–5 కోట్ల ధర ఉండే ఇళ్లు 28 శాతం వృద్ధితో 13,735 సేల్ అయ్యాయి. అలాగే రూ.5–10 కోట్లు ధర ఉండే గృహాలు 82 శాతం పెరుగుదలతో 3,448 సేల్ అయ్యాయి. రూ.10–20 కోట్లు ఖరీదు చేసే యూనిట్లు 114 శాతం వృద్ధి రేటుతో 658 అమ్ముడయ్యాయి. అలాగే రూ.20–50 కోట్ల ధర ఉండే ప్రీమియం ఇళ్లు 124 శాతం వృద్ధితో 92 యూనిట్లు అమ్ముడుపోయాయి.

88,274 ఇళ్ల విక్రయాలు..

దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 88,274 యూనిట్లు అమ్ముడుపోయాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా అధ్యయనం వెల్లడించింది. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది రెండు శాతం ఎక్కువ. 2025 క్యూ1లో కొత్తగా 96,309 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. 2024 క్యూ1తో పోలిస్తే ఇది 3 శాతం అధికం. హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 9,459 ఇళ్లు అమ్ముడుపోగా.. 10,661 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి.

ధర	యూనిట్లు	వృద్ధి (శాతంలో)
రూ.50 లక్షల కంటే తక్కువ	21,010	9
రూ.5 లక్షల నుంచి రూ.కోటి	26,832	6
రూ.1–2 కోట్లు	22,330	2
రూ.2–5 కోట్లు	13,735	28
రూ.5–10 కోట్లు	3,448	82
రూ.10–20 కోట్లు	658	114
రూ.20–50 కోట్లు	92	124
రూ.50 కోట్లపైన	169	483

ఆఫీసు స్పేస్ అధరహో..



దేశంలోని 8 ప్రధాన నగరాలలో 2025 క్యూ1లో 2.82 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. ఇందులో అత్యధికంగా 44 శాతం వాటా గ్లోబల్ కేపబులిటీ సెంటర్లదే(జీసీసీ). 2025 క్యూ1లో జరిగిన లీజుల్లో అత్యధికంగా 1.24 కోట్ల చ.అ. స్థలాలు జీసీసీల ఏర్పాటు కోసమే జరగడం గమనార్హం. ఆఫీసు స్పేస్‌లలో ఐటీ హబ్‌లైన బెంగళూరు, హైదరాబాద్ తీవ్రంగా పోటీపడుతున్నాయి. హైదరాబాద్ 2025 క్యూ1లో 40 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 31 శాతం ఎక్కువ. గతేడాది చివరి త్రైమాసికం (క్యూ4)లో 31 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. నగరంలో గృహాలు, ఆఫీసు స్థలాల అద్దెలు ఏటా 9 శాతం మేర పెరుగుతున్నాయి.

నగరం	ఆఫీసు స్థలం (చ.అ.లక్షల్లో)
బెంగళూరు	1.27 కోట్లు
హైదరాబాద్	40
పుణే	37
ముంబై	35
ఎన్‌సీఆర్	21
చెన్నై	18
అహ్మదాబాద్	2
కోల్‌కతా	2

ఎక్స్‌ట్రా రూమ్

ఫ్లాట్లలో అదనపు గది కోరుతున్న కస్టమర్లు

కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితం కావడం అనివార్యమైంది. కరోనా కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీపడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని.. చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్‌ఎల్–రూఫ్ అండ్ ఫ్లోర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్‌తో సహా ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై, పుణె నగరాలలో 2,500 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. పలు కీలకాంశాలివే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాసెల నేపథ్యంలో ఫ్లోర్ ప్లాన్స్‌లలో మార్పులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరు మోసిన డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్ట్‌లలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

❖ వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తాము ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.

❖ బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని ఓ సంస్థ ఎండీ తెలిపారు. కరోనా ప్రారంభం నుంచి ల్యాండ్ బ్యాంక్‌ను సమీకరించిన డెవలపర్లు.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రెండో అర్ధ భాగం నుంచి గృహ లాంచింగ్స్‌లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.



